క్లుప్తంగా

8 నామినేషన్ల దాఖలు

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గ అసెంబ్లీ స్థానాలకు మంగళవారం 8 నామినేషన్లు దాఖలయ్యాయి. బీజేపీ నుంచి పి.విష్ణుకుమార్‌రాజు రెండు సెట్లు, ఆయన కుమార్తె పి.శ్యామల దీపిక మరో రెండ్లు సెట్ల నామినేషన్లు వేశారు. వారితో పాటు కాంగ్రెస్ పార్టీ నుంచి వి.వి.ఎస్.కమలాకర్‌రావు, బహుజన పార్టీ నుంచి పెద్దాడ కనక మహాలక్ష్మి, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుంచి రామారావు లక్కారాజు రెండు సెట్ల నామినేషన్ పత్రాలను సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ ఆఫీసర్ డి.అఖిలకు అందజేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మురళీనగర్: జోన్–2 డివిజన్ మర్రిపాలెం సెక్షన్ పరిధి మర్రిపాలెం 11 కేవీ లైన్ల నిర్వహణ పనుల కారణంగా బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మహారాణి వీధి, మర్రిపాలెం మెయిన్ రోడ్డు, రైల్వే క్వార్టర్స్, గవర వీధి, రాణా ప్రతాప్ నగర్, గొల్ల వీధి, శ్రీనివాస నగర్, హౌస్సేన్ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

టెన్త్ ఫలితాల్లో 'విశ్వతేజ' విద్యార్థుల ప్రతిభ



స్కూల్ టాపర్లను అభినందిస్తున్న భాస్కరరావు

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెంలోని విశ్వతేజ స్కూల్ విద్యార్థులు సోమవారం విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో సత్తా చాటారు. ఈ స్కూల్ నుంచి మొత్తం 54 మంది పరీక్షలు రాయగా.. అందరూ ఉత్తీర్ణులయ్యారని, వీరిలో 25 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ ఐ.భాస్కరరావు తెలిపారు. జి.యశశ్విని 579, పి.యశశ్విని 576, ఎస్ పురందేశ్వరి 573 మార్కులతో ఎస్కూల్ టాపర్లుగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా మంగళవారం టాపర్లను పాఠశాల పిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి



నవీన్ సాయిరాజ్ మృతదేహం

మర్రిపాలెం: ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన జి.నవీన్‌సాయిరాజ్(23) నాలుగేళ్ల నర్సింగ్ కోర్సు పూర్తి చేసి విశాఖలో జాబ్ ట్రైనింగ్‌లో ఉన్నాడు. ఈ క్రమంలో మురళీనగర్ ఎన్‌జీజీవోస్ కాలనీలో ఉంటున్న తన మేనమామ ఇంటికి ఆరోగ్యం బాగులేదని సోమవారం మధ్యాహ్నం వెళ్లాడు. అందరితో బాగానే ఉన్నాడు. రాత్రి భోజనం చేయమని వారు పిలవగా.. కడుపు నొప్పిగా ఉంది, కాసేపు ఆగి తింటానని చెప్పాడు. అలా రాత్రి 11.30 గంటల వరకు వారితో మాట్లాడుతూ గడిపాడు. ఆ తరువాత వారంతా నిద్రపోయారు. మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో నిద్ర లేచి చూసేసరికి నవీన్ స్పృహ కోల్పోయి ఉండటాన్ని బంధువులు గమనించారు. వెంటనే రామ్‌నగర్ కేర్ ఆస్పత్రికి తీసుకెళ్లి అతడి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. యువకుడు చికిత్స పొందుతూ ఉదయం 6.45 గంటలకు మృతిచెందాడు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో ఏఎస్‌ఐ కనకరాజు కేసు దర్యాప్తు చేపట్టారు. యువకుడి మృతికి గల కారణాలను పోలీసులు తెలుసుకుంటున్నారు.

రైతులకు అందుబాటులో విత్తనాలు

మహారాణిపేట: వేరుశనగలో లావు గింజ రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతుల అవసరం మేరకు ఇండెంట్ పెడితే యూనివర్సిటీ నుంచి వ్యవసాయ శాఖకు సరఫరా చేస్తామని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎల్.ప్రశాంతి అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉత్తర కోస్తా మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా మండలి రెండో రోజు సమావేశంలో ఆమె మాట్లాడుతూ శాస్త్రవేత్తలకు దిశానిర్దేశం చేశారు. విస్తరణ సంచాలకులు డాక్టర్ కె.ఎస్.ఎస్.నాయక్ వేరుశనగలో కొత్తగా వచ్చిన రకాల మీద అవగాహన కల్పించారు. ఆత్మ పథకం ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాలపై నాబార్డ్ జీఎం నాగార్జున వివరించారు. శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయ అధికారులు, అభ్యుదయ రైతులు పరిశోధన, విస్తరణ కార్యక్రమాలపై చర్చించారు. ప్రాంతీయ వ్యవ సాయ పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ పి.వి.కె. జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధికి పట్టం కట్టండి

- సీఎం జగన్‌తోనే ప్రజా సంక్షేమం
- వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు
- ఎన్నికల ప్రచారంలో అడుగడుగునా ఆదరణ



నేనున్నానని మహిళకు భరోసా ఇస్తున్న కె.కె.రాజు

మర్రిపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో చేపట్టిన సంక్షేమాభివృద్ధికి సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు పట్టం కట్టాలని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు కోరారు. జీవీఎంసీ 50వ వార్డులో కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయనకు అడుగడుగునా ఆదరణ లభించింది. కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఎంఆర్‌ఎఫ్ షోరూం వద్ద నుంచి పాదయాత్రగా ఫోర్ రోడ్డు జంక్షన్, సత్యనగర్, సూర్యానగర్, సాయిరాంనగర్, మౌర్యా చాంబర్స్ రోడ్డు, బ్యాంకు స్ట్రీట్, సింగరాయికొండ, టెన్నిస్ కోర్ట్ రోడ్డు, వర్మా కాంప్లెక్స్, తెన్నేటినగర్, మన్యం కాలనీ, మాధవధార జంక్షన్ 48 బస్‌స్టాప్ వరకూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయనకు మహిళలు పెద్ద ఎత్తున హారతులు పట్టి, పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రం ఎంతో సుభిక్షంగా ఉందన్నారు. ప్రజల సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి ఆయన ఎంతో పాటుపడ్డారని, మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సంక్షేమం ఒక్క వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని చెప్పారు. ఎన్నికల్లో ఓటర్లు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



50వ వార్డులో ప్రజలకు అభివాదం చేస్తూ పాదయాత్రగా సాగుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు, చొక్కాకుల వెంకటరావు, సనపల చంద్రమౌళి తదితరులు

కార్యక్రమంలో ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు, పశ్చిమ ఎన్నికల పరిశీలకులు పేడాడ రమణికుమారి, బగాది విజయ్, పైడి కృష్ణారావు మాస్టరు, అమర్‌రెడ్డి, ఎం.లక్ష్మి, పైడి శ్రీను, పి.సునీత, నంబాల ఈశ్వరరావు, వార్డు నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

మీలో ఒకడిని.. దీవించండి



50వ వార్డు ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక పకోడీ బండి వద్ద సమోసాలు వేస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

వైఎస్సార్‌సీపీతోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి





ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

ప్రజలంతా తమ వైపే: కె.కె.రాజు

మర్రిపాలెం: ప్రజలను గాలికొదిలేసి.. ఇన్ని రోజులూ బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు ఏమయ్యాయని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు మండిపడ్డారు. 50వ వార్డులో ఎన్నికల ప్రచారం అనంతరం మాధవధార జంక్షన్‌లోని 48 బస్‌స్టాప్ వద్ద జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఐదేళ్లుగా బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు ఎక్కడా.. ఎందుకు కనిపించలేదని ప్రశ్నించారు. ఇప్పుడు ఓట్లు కావాల్సి వచ్చి తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు వెన్నుపోటు రాజకీయాలు కొత్తకాదని, పిల్లనిచ్చిన సొంత మామనే పదవికోసం వెన్నుపోటు పొడిచారన్నారు. ఉత్తరాంధ్ర వైపు ఎన్నడూ కన్నెత్తి కూడా చూడలేదని, ఆ ప్రాంతం నాశనమవడానికి కారణం ముమ్మాటికీ చంద్రబాబేనని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకే ఉత్తరాంధ్ర అభివృద్ధి జరిగిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమం కోసమే నిరంతరం పాటుపడుతున్నారని తెలిపారు. ఎన్నడూ లేని విధంగా విశాఖలో ఇనార్బిట్ మాల్, రహేజా ఐటీ టవర్, ఏఎన్‌సీ మాల్ వంటి సంస్థలను తీసుకొచ్చి రానున్న రోజుల్లో స్థానికంగా సుమారు 20 వేల మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేశారన్నారు. ప్రజలంతా తమ వైపే ఉన్నారని, వైఎస్సార్‌సీపీ గెలుస్తుందనడానికి ఆ ఒక్క ధైర్యం చాలని కె.కె.రాజు పేర్కొన్నారు.

ప్రజలతో మమేకం కండి



48వ వార్డులో పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కె.కె.రాజు

కంచరపాలెం: ప్రజల సమస్యలు తెలుసుకుని వారితో మమేకం కావాలని కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు పిలుపునిచ్చారు. జీవీఎంసీ 48వ వార్డు బర్మా క్యాంప్‌లో బొగ్గు శ్రీను ఆధ్వర్యంలో మంగళవారం వార్డు ఎన్నికల కార్యాలయాన్ని ముఖ్య అతిథిగా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గాలికి కూటమి కొట్టుకుపోవడం ఖాయమన్నారు. వార్డు ప్రజలకు వైఎస్సార్‌సీపీ అందుబాటులో ఉండేందుకు పార్టీ కార్యాలయం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కొండవాలు ప్రాంతాల్లో రాజకీయ పార్టీలకు అతీతంగా పార్టీ కార్యాలయం పనిచేస్తుందని చెప్పారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, పార్టీ వార్డు ఇన్‌చార్జి నీలి రవి, సీనియర్ నాయకుడు కర్రి రామారెడ్డి, చిర్లా సత్యనారాయణరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ వసంతల అప్పారావు, రాజాన గంగరాజు, భూలోక్, పద్మ, హేమంత్, కార్యకర్తలు, కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

వైభవుడికి పంచామృతాభిషేకం

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో చైత్ర పూర్ణిమ సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 6.30 గంటలకు ఆర్జిత సుప్రభాత సేవ జరిగింది. అనంతరం స్వామికి పాలు, తేనె, పెరుగు, నెయ్యి, పంచదార, ఫలరసాలు, పసుపు, కుంకుమ, చందనం వంటి విశేష సుగంధ ద్రవ్యాలతో పంచామృతాభిషేకం నిర్వహించారు. వైభవుడిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కె.కె.రాజును గెలిపిద్దాం



25వ వార్డు గణేష్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం గణేష్‌నగర్, మూడుగుళ్లు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గంలోని 17 వార్డులను అభివృద్ధి పథంలో నడిపించిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును గెలిపించాలని ఇంటింటి ప్రచారం చేపట్టారు. 25వ వార్డులో సుమారు రూ.8 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కమ్మిల నవీన్‌కుమార్ రాజు, అనిల్‌రెడ్డి, బుజ్జి, సచివాలయ కన్వీనర్లు సానబోయిన సురేష్, వెంపటాపు నూకరాజు, పద్మ, పోతిబంతి హరికృష్ణ, శేఖర్, జయ, గోవింద మ్మ, నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు, కో కన్వీనర్లు, గృహసారథులు, మహిళలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి

జీవీఎంసీ 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 86వ బూత్ పరిధిలోని నందగిరినగర్ చెక్కుడురాయి బిల్డింగ్ ప్రాంతంలో ఒకటి నుంచి 6 లైన్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డు నాయకులు, కార్యకర్తలు, మహిళలతో కలిసి ఇంటింటికీ వెళ్లి గడిచిన ఐదేళ్లలో ఉత్తర నియోజకవర్గంలో, 43వ వార్డులో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించి, కరపత్రాలు పంచారు. ఉషశ్రీ మాట్లాడుతూ నిత్యం ప్రజలతో మమేకమై వారి సంక్షేమం కోసం పాటిపడే ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. రవీంద్రనాథ్ ఠాగూర్, బైర వెంకట్, రాజు, వల్లి, సిర్రా లక్ష్మణ్, ఖాదర్, పద్మాశేఖర్, సూర్యారావు, రాణి, రమ, సింహాచలమ్మ, ప్రశాంత్, రాజు, రాజి, కార్యకర్తలు పాల్గొన్నారు.



43వ వార్డు నందగిరినగర్‌లో ఓటు అభ్యర్థిస్తున్న కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ

అభివృద్ధిని చూసి ఓటేయండి

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో మంగళవారం సాయంత్రం కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కళింగనగర్ పరిసర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బలపరిచిన వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కె కె రాజులను గెలిపించాలని కోరారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పైడి శ్రీనివాసరావు, దిడ్డి రమేష్, ప్రసూనారెడ్డి, బి.తిరుమలరావు, రాజంరాజు, ఎం.దమయంతి, పి.లక్ష్మణ్, శ్యామ్, గణేష్, లత, రాణి పాల్గొన్నారు.



51వ వారులో కరపత్రం అందించి ఓటడుగుతున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

ఆటో డ్రైవర్లకు అండగా ప్రభుత్వం

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డులోని ఆటో డ్రైవర్లు, ఓనర్లతో మంగళవారం వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ ఆధ్వర్యంలో తాటిచెట్లపాలెం 80 ఫీట్ రోడ్‌లోని వార్డు ప్రచార కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పైడి రమణ మట్లాడుతూ ఆటో కార్మికుల కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వారికి ప్రోత్సాహకంగా ప్రతీ ఏడాది వాహన మిత్ర అందజేస్తున్నారన్నారు. వీరి కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. ఉత్తర నియోజకవర్గంలో ప్రతి సమస్యనూ పరిష్కరిస్తూ, ఐదేళ్లుగా ప్రజల్లో ఉన్న కె.కె.రాజును ఎమ్మెల్యేగా, బొత్స ఝాన్సీని ఎంపీగా గెలిపించుకోవాలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు హరిపట్నాయక్, రాయుడు శ్రీనివాసరావు, స్థానిక ఆటో యూనియన్ నాయకులు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

నేటి నుంచి చదరంగంలో ఉచిత శిక్షణ

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి విద్యార్థులకు చదరంగం ఇండోర్ క్రీడపై శిక్షణ తరగతులను మురళీనగర్ వాకర్స్ పార్కులో నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కార్యదర్శి పి.చెల్లారాజు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు మే 4 వరకు ప్రతి రోజూ సాయంత్రం 5 నుంచి 6.30 గంటల వరకు చదరంగం శిక్షకుడు సనపల ఉమాపతి ఉచితంగా శిక్షణ ఇస్తారని చెప్పారు. శిక్షణ అనంతరం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. ఆసక్తి గల బాలబాలికలు 94901 84360, 98851 99530, 94404 01874, 94912 92369 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

నారాయణరావు సేవలు నిరుపమానం



నారాయణరావు, హనితను సత్కరిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు తదితరులు

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పర్యవేక్షకుడిగా పని చేస్తూ పదోన్నతిపై ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా వెళ్లిన వై.నారాయణరావుకు, సివిల్ సర్వీసెస్‌లో 887 ర్యాంకు సాధించిన వేములపాటి హనితకు మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ నారాయణరావు సేవలను కొనియాడారు. 2011 నుంచి ఆయనతో తనకు పరిచయం ఉందని, ఇలాంటి వ్యక్తి డీఎంహెచ్‌వో కార్యాలయానికి ఎంతో అవసరమన్నారు. కార్యాలయంలో శిక్షణ పొందుతున్న వేములపాటి హనిత సివిల్ సర్వీసెస్‌లో ర్యాంకు సాధించడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఆమె త్వరలో కలెక్టర్‌గా విశాఖ జిల్లాకే వస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం ఏవో సుమతి, జిల్లా ఎయిడ్స్ నివారణాధికారి డాక్టర్ పి.పూర్ణేంద్రబాబు, నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, డాక్టర్ సమత, దుర్గాప్రసాద్, జిల్లా మీడియా విస్తరణ అధికారి (డెమో) బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దళిత ద్రోహి చంద్రబాబు

- ముఖ్యమంత్రి జగన్‌తోనే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మేలు
- దళిత క్రిస్టియన్ జేఏసీ చైర్మన్ పెరిక వరప్రసాద్



మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ వరప్రసాద్, చిత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

సీతమ్మధార: ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సమన్యాయం చేసింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని దళిత క్రిస్టియన్ జేఏసీ చైర్మన్ పెరిక వరప్రసాద్ అన్నారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ ఉత్తర కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ దళిత ద్రోహి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడని విమర్శించారు. ముఖ్యమంత్రి పేదలకు ఆంగ్ల మాధ్యమంలో విద్యా విధానం తెస్తానంటే కోర్టులో కేసు వేయించి ఆపించేందుకు ప్రయత్నించాడని ఆరోపించారు. పేదవాడు ఇంగ్లిష్ మీడియంలో చదువుకోకూడదని అడ్డుకోవడంలో చంద్రబాబు కుట్ర దాగి ఉందన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే చంద్రబాబు కోర్టులో కేసు వేసి అడ్డంకులు సృష్టించాడన్నారు. అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చెందాలనే సదుద్దేశంతో పరిపాలనా వికేంద్రీకరణకు సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారన్నారు. విశాఖను పరిపాలన రాజధానిగా చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నారని, తద్వారా ఉత్తరాంధ్ర మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నాన్నారు.

వైఎస్సార్‌సీపీకే మా మద్దతు

క్రిస్టియన్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు వైఎస్సార్‌సీపీకే మద్దతుగా ఉన్నారని వరప్రసాద్ తెలిపారు. ఉత్తర నుంచి గత ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓడినప్పటికీ అలుపెరగని యోధుడిలా కె.కె.రాజు ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సహకారంతో ఉత్తర నియోజకవర్గాన్ని ఆదర్శంగా అభివృద్ధి చేశారన్నారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏపీ పాస్టర్స్ ఫెడరేషన్ సెక్రటరీ జేమ్స్, వైఎస్సార్‌సీపీ నాయకులు, క్రిస్టియన్ నాయకలు సుధాకర్ పాల్, హేమంత్‌కుమార్, హనీ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

యాతలకు అండగా నిలిచింది సీఎం జగనే

ఉత్తరాంధ్ర యాత సంఘం అధ్యక్షుడు పిల్లి నూకరాజు



పిల్లి నూకరాజు, పిల్లి సుజాతలను సత్కరిస్తున్న యాత కులస్తులు

తాటిచెట్లపాలెం: యాత కులస్తులకు అండగా నిలిచింది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ఉత్తరాంధ్ర యాత సాంస్కృతిక సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు పిల్లి నూకరాజు తెలిపారు. నరసింహనగర్‌లోని ఆయన నివాసంలో ఉత్తర నియోజకవర్గ యాత కుల అధ్యక్షులు, ముఖ్య నాయకులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు ఏ నాయకుడు, ప్రభుత్వాలు చేయని సంక్షేమం ఈ ప్రభుత్వ హయాంలో కల్లుగీత వృత్తిదారులకు జరిగిందన్నారు. కల్లుగీత వృత్తిదారులకు వృత్తి లేని సమయంలో ఆర్థిక సహకారం, విశాఖ పరిధిలో యాతల సంక్షేమం కోసం కనీసం 500 గజాల స్థల కేటాయింపు వంటి మరికొన్ని డిమాండ్లు ఇంకా నెరవేర్చవలసి ఉందన్నారు. యాతలను బీసీ–ఏగా మార్చేందుకు కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇన్ని విధాల ఆదుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. యాత కులస్తులందరూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు తమ ఓట్లు వేసి ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. యాత కులస్తులకు వివిధ సంక్షేమ పథకాల రూపంలో ఏడాదికి సుమారు రూ.45 కోట్లు ప్రభుత్వం అందజేస్తుందని సమావేశానికి హాజరైన ఏపీ యాత వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత తెలిపారు. సుమారు ఏడు పథకాల ద్వారా 37 లక్షల మంది ఈ పథకాలు పొందుతున్నారని ఆమె తెలిపారు. తమ వర్గ సంక్షేమం కోసం సహకరిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పిల్లి నూకరాజు, పిల్లి సుజాతలను ఉత్తర నియోజకవర్గ యాత కులస్తులు ఘనంగా సత్కరించారు. ఉత్తరాంధ్ర యాత సంక్షేమ సాంస్కృతిక సేవా సంఘం ఉత్తర అధ్యక్షుడు సిమ్మ గోవింద, సంఘం కార్యవర్గ సభ్యులు గొడ్డు కన్నారావు, బసరమాని ఈశ్వరరావు, సంపంగి మంగరాజు, కార్యదర్శి భాస్కరరావు, పిల్లి చిన్నారావు, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చైత్ర పౌర్ణమి పూజలు



నృత్య ప్రదర్శనతో అలరించిన చిన్నారులు



సుబ్రహ్మణ్య స్వామి ఊరేగింపులో దేవాల రాజు, భక్తులు

కంచరపాలెం: ఊర్వశి జంక్షన్ రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్య స్వామి ఏకాంత ఆలయంలో కార్తీకేయ శరవణ ట్రస్టు ఆలయ ధర్మకర్త దేవాల రాజు(కృష్ణ) ఆధ్వర్యంలో మంగళవారం చైత్రమాస బహుళ పూర్ణిమ పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామకృష్ణ శర్మ నేతృత్వంలో సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. పురువీధుల్లో సుబ్రహ్మణ్య స్వామిని ఊరేగించారు. సాయంత్రం శ్యామల అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదానం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వైస్ చైర్మన్ చొక్కాకుల కుమారి, కడగల జ్యోతీష్, కార్యదర్శి కాండ్రేగుల రాము, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సత్యదేవుని ఆలయానికి పోటెత్తిన భక్తులు



రమా సహిత సత్యనారాయణ స్వామి

దాబాగార్డెన్స్: ఇసుకకొండ(బాబాజీ కొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. చైత్ర పౌర్ణమి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు. వేకువ జాము 4 గంటల నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. నగరం నుంచే కాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి తరలి వచ్చారు. ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిగాయి. ధ్వజస్తంభం చుట్టు భక్తులు ప్రదక్షిణ నిర్వహించారు. ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్ పర్యవేక్షించారు. భక్తులకు మంచినీరు ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు. పలువురు ప్రముఖులు స్వామిని దర్శించుకున్నారు.

సాధనతోనే సత్ఫలితాలు



టెన్త్ విద్యార్థులతో ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ప్రిన్సిపాల్ మనోజ్, రెవరెండ్ ఫాదర్ సురేష్‌బాబు

సీతమ్మధార: నిరంతర సాధనతోనే సత్ఫలితాలు సాధించవచ్చని, తమ పాఠశాల విద్యార్థుల ఫలితాలు నిరూపించాయని సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ మనోజ్ పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించిన విద్యార్థులను మంగళవారం పాఠశాల యాజమాన్యం అభినందించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ స్కూల్ నుంచి 195 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరు కాగా.. అందరూ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై రికార్డు నెలకొల్పారన్నారు. కాంగ్రిగేషన్ ప్రొవిన్సియల్ రెవరెండ్ ఫాదర్ పి.సురేష్‌బాబు, ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధతో ఈ ఏడాది పాఠశాలలో క్రీడా, సాంస్కృతిక, విజ్ఞాన రంగాల్లో ఉత్తమ ప్రతిభ చూపామన్నారు. ఎస్.హిమని 594, కె.పి.వి.స్వరూపిణి 592, డి.యశ్వంత్ 587 మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థులందరూ 500కు పైగా మార్కులు సాధించడం విశేషమన్నారు. స్కూల్ ప్రాంగణంలో టెన్త్ విద్యార్థులను పి.సురేష్‌బాబు, పాఠశాల కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ కె.వి.జోసెఫ్ సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.